**కామెడీ కథ**

# బుల్లితెర పాఠాలు

**వెళిపోతూ, వెళిపోతూ సందు లోకి చూసాడు కానిస్టేబిలు కనకారావు. వీధి మొదట్లో జనం..గుంపులు గుంపులుగా కనిపించారు.**

'నాకెందుకులే..పోదాం!' అనుకునే రకం కాకపోవటం వల్ల సైకిలు సందులోనికి తిప్పాడు. ఏవన్నా మర్డరా?...గేస్ సిలిండర్ పేలిందా..? కేడీనాకొడుకెవుడయినా దొరికిపోండా?..ఈది కొట్లాటా?

అసలేటయింది?

ఏదయినా తన బీటూ...తన రూటూ!

ఎళ్తే తప్పేముంది?

అసలే ప్రమోషన్ లిస్టులో ఉన్నాడూ!

అనుకున్నట్లే వెళ్ళాడు.

ఇంటినిండా ఆడాళ్ళే! ఒకళ్లో, ఇద్దరో మగాళ్ళున్నారంతే!

"ఏటయింది?..తప్పుకోండి! తప్పుకోండెహె!" అని జనాన్ని విదిలిస్తూ..అడ్డంగా వచ్చినాళ్ళని పక్కకి నెడుతూ..ముందుకు దూసుకుపోయాడు బాణంలా!

అక్కడందరూ బిక్కచచ్చిపోయారు.

కనకారావేమడిగినా అందరూ మవునంగానే ఉండిపోయారు.

తాపీగా తెలుసుకున్న విషయమేమంటే...

* * *

"ఏఁయ్! నిన్నే..ఏంటలా ముంగిలా నిలబడ్డావ్? టైమెంతయిందో తెలుసా?"

"ఊహూ..నాకు తెలీదు. మీలాగా డిగ్రీ కాదుగా, పీ.జీ. మాత్రమే చేసాను. టైం చూడ్డం నాకేం తెలుస్తుంది?" లోకనాథం ప్రశ్నకి లోకేశ్వరి జవాబు.

దాంతో లోకనాధంకి దిమ్మెత్తింది.

"అంటే!..నేను నీకంటే తక్కువనా నీ ఉద్దేశ్యం?"

"ఓ యబ్బో! తక్కువెందుకనుకుంటాను. ఎత్తులోనూ, బరువులోనూ, తిండిలోనూ అన్నింటా ఎక్కువే!" పెదవి విరుస్తూ అంది లోకేశ్వరి.

"అంటే..నేను తిండిపోతునీ..బుద్ధిలేని వాణ్ణనేగా నీ ఉద్దేశం?"

"నా మాటల్లో మీకా అర్థం వచ్చిందా? పుచ్చకాయల దొంగంటే భుజాలు తడుపుకున్నాట్ట వెనకటికెవడో?! అయినా 'బుద్ధిమాలిన వాడని' ఏ పతిదేవుణ్ణయినా..ఈ హిందూ దేశంలో సతీమణులనగలరా?"

"నువ్వంటున్నావుగా!"

"అవ్వ!? ఎంత మాట. అపచారం, అపచారం! ఎంత ఉన్నమాటయినా అంత ధైర్యంగా అనగలిగే ఖలేజా నాకెక్కడిదండోయ్!" మూతి మూడు వంకరలు తిప్పుతూ అంది లోకేశ్వరి.

"అసలు నీకేమయిందివాళ? మీ అమ్మ అనమందా? నీ బాబనమన్నాడా? నీ యక్కనమందా? అసలేమిటి కథ?" మిక్సీలో వేసిన కందిపప్పులా పటపటమన్నాడు.

"ఇదిగో.. మీకే చెప్తున్నాను. ఇది రెండోసారి! మాది సంప్రదాయ కుటుంబం! రావుబహుద్దూర్ విశ్వనాధంగారమ్మాయిని. మొదట్నించీ ఎడ్యుకేటెడ్ ఫామిలీ! మీకు తెలీదేమో. మా తాతమ్మ..ఆరోజుల్లో ఎం.ఏ. లిట్ ఆంగ్లాంధ్రాలు..నామలింగాను శాసనం ఔపోసన పట్టింది. మీకు తెలుసో తెలీదో.. బమ్మెరపోతన పద్యాల్ని ఇంగ్లీషులోకి తర్జుమా చేసింది. తల్లికొంగు పట్టుకుని, బొటన వేలు చీకుతూ..నంగినంగిగా తిరగటానికి నేనేం సర్వేశ్వరరావు కూతుర్నీ కాదు, లోకనాధంనీ కాదు. మా నాన్న ఆడపిల్లనైనా...రుద్రమదేవిలా పెంచాడు. మాటలు జాగర్తగా రానీ?" అని కొంగు మొల్లో దోపింది ఏకవచనంలోకి మారుతూ.

"ఏంటే..ఏంటి నీ తలబిరుసు? పళ్ళూడగట్టానంటే...వెళ్ళి మీ అమ్మమ్మ పక్కన వక్కపొడి..చక్కిలాలు..గుండ చేసుకుని నములుతూ కూచోగలవు. బోడి పీ.జీ. అఫ్టరాల్ హిందీ ఎం.ఏ! గ్రేడు 2 పోస్టు సంపాయించలేకపోయావు!"

"అదే..మరదే..ఎక్స్ట్రా..నేం తల్చుకుంటే లెక్చరర్నే అయి ఉండేదాన్ని. లక్షలు లక్షలు కట్నం..పదిహేను తులాల బంగారం..మూడు కేజీల వెండి. మీ బాబు చేతిలో పోసి..ఎండనకా..వాననక..అలిసి..తడిసి..నేనెందుకుజ్యోగం చెయ్యాలి? అందుకే-నీ బాధ భరించలేక పరీక్ష రాసా గాని..మనస్ఫూర్తిగా రాయలేదు. రాసుంటే నేను కాదు..నా తల్లో పేను, ఈను కూడా ఆ బోడి టెస్టు పాసయి ఉండేది!" అంది.

"ఓసి నీ యమ్మకడుపుమాడ! నీ కడుపులో ఇంత కుళ్ళుందంటే..ఇక నిన్ను బతక నివ్వను. ఏ రోజో గేస్ ఆన్ చేసి..నీ పని పట్టేస్తాను" అని బొబ్బిలి కోడి పుంజులా మీదకి లేస్తున్న లోకనాధాన్ని..అంతకు అర్ధ గంట క్రితం టీ పొడి ఎరువుకోసం వచ్చిన కామాక్షమ్మ అటకాయించింది.

"అన్నయ్యగారూ! ఇన్నాళ్ళూ మీదెంతో ఆదర్శదాంపత్యం అని వీధిలో అందరూ అనుకునే వాళ్ళం! ఇవాళేమయింది? మీలో మీకిన్ని విభేదాలున్నాయని..ఎవ్వరం అనుకోలేదు. వదినగారు తప్పుచేస్తే క్షమించాలి దొడ్డ మనసుతో" అంటున్న కామాక్షి మాటలకి లోకేశ్వరి, లోకనాథం విరగబడి నవ్వుతూ చప్పట్లు కొట్టారు.

"అయితే ప్రయిజు మాదే!" అన్నారు.

"చెల్లెమ్మా..అంత నేచురల్గా ఉందా నా నటన?" అన్నాడు లోకనాధం.

"నటనా?" ఇప్పుడాశ్చర్యపోవటం కామాక్షి వంతయింది. కామాక్షి తల తిరిగి పోయింది. అప్పుడంతా వివరంగా చెప్పింది లోకేశ్వరి. ఏదో టీవీ వాళ్ళు 'మొగుడు..పెళ్ళాలు' ఎంత రసవత్తరంగా తగూలాడుకుంటే..అంత మంచి బహుమానం ఇస్తామని పోటీలు పెట్టారట. దానికోసం ఇవి రిహార్సల్సట!

పొంగుతున్న పాలుమీద, నీళ్ళు పోసినట్లు...రగుల్తున్న నిప్పుమీద నీళ్ళు చల్లినట్లు డిసప్పాయింటు అయి కామాక్షి వెనుదిరిగింది వచ్చినపని కూడా మరచి!

ఇది జరిగి ఓ నెలరోజులయింది.

అనుకున్నట్లే లోకనాథం దంపతులకు మెమొంటో బహుమతీ...వచ్చాయి. అందరూ అభినందించారు.

ఓ రోజు ఆఫీసు నుండి వచ్చిన లోకనాథం- భార్య టీవీ చూస్తూ తనని గమనించకపోవటంతో లుంగీ మార్చుకుని..బాత్రూంకెళ్ళి వచ్చాడు. ఆ తరువాత చూస్తున్న సీరియల్ మధ్యలో బ్రేక్ రావటం..తల ప్రక్కకి తిప్పటంతో..

"ఏమండీ! ఎంత సేపయిందీ వచ్చి?" అంది టీ పెట్టడానికి లేస్తూ.

"అరగంటయింది. నేను డ్రెస్ ఛేంజ్ చేసుకుని..టీ పెట్టుకొని..వచ్చాక..ఇప్పుడా గమనించావ్?"

"సారీ అండి" అంది గోముగా.

ఆఫీసులో జరిగిన సంఘటన మనసుని చెల్లాచెదరు చేయటంతో.."మరీ అంత సీరియస్నెస్ పనికిరాదు. నేనయింది సరిపోయింది. అదే ఏ దొంగ వెధవో అయితే..ఏమయి ఉండేది?" అన్నాడు సీరియస్గా.

"అంటే..నేనంత ఒంటిమీద తెలివిలేకుండా ఉన్నానా? ఇవాళ కొంచెం సస్పెన్స్గా ఉండటంతో..వెళ్ళేది పనిమనిషేమో అనుకున్నాను" అంది పొరపాటుగా."అంటే..నీకంత హీనంగా కనిపిస్తున్నానా? ఇవాళాఫీసులో బాసుగాడూ అంతే..నేను అర్ధ గంట ముందెళ్తే..అర్ధగంట ఆలస్యంగా వెళ్ళానని ఎటెండెన్స్ రిజిష్టర్లో కొశ్చన్ మార్కేసాడు. పైగా వాడు రావటం నేను చూసి కూడా..తల పక్కకి తిప్పి..ఆ లేడీ టైపిస్ట్తో మాట్లాడుతున్నానని అపనిందొకటీ! వాడి



చప్పిడిముక్కు. గౌడుగేదెలా నల్లగా నిగనిగలాడిపోతుంటాడు. దానికితోడు స్నఫ్ కలర్ సఫారీ డ్రెస్సూ..బ్లాక్ షూ..వాడ్ని చూసి భానుప్రియలాటి ఆ టైపిస్ట్..వాణ్ణి వలచీ లేదట..ఇవాళెవరి ముఖం చూసానో..రోజంతా ఇలా ఏడిచింది!''

''అవున్లెండి. ఇన్నాళ్ళకి మీ బాగోతం రచ్చకెక్కింది. ఆ టైపిస్ట్ మీకు భానుప్రియ అయిపోయింది. తెల్లారి లేస్తూనే మీకు బ్రష్ అందించిన నేను బ్రహ్మరాక్షసిలా కనిపించాను. నా ముఖం చూడబట్టేగా..మీకిన్ని కష్టాలు..రేపే..రేపే నేను మా వాళ్ళింటికి పోయి..ఏదన్నా 'జాబ్' చేసుకుంటా. మీరా భానుప్రియతో ఆనందంగా ఉండండి!'' అని పెద్ద ఏడుపులు, పెడబొబ్బలు పెడుతుంటే, చేసిన తప్పును తెలుసుకుని, నాలుక కటుక్కున కరచుకుని, వసుదేవుడు గాడిదకాళ్ళు పట్టుకున్నట్లుగాక... శ్రీకృష్ణుడు సత్యభామ పాదాక్రాంతుడైనట్లు పాదాలు తాకాడు.

ఆమె తక్కువ తిందా?

సత్యభామే అయింది. చేతిలో రిమోటు విసిరింది. అది కొంచెంలో తప్పింది. లేకపోతే కన్నే పోయి ఉండేది! ఈ కేకలకి..సీతా, రోజా, ప్రక్కింటి కామేశ్వరరావు, కామాక్షీ వెనకింటి కళ్యాణి..పక్కింటి పద్మా..ఎదురింటి వెంకయ్యమ్మా..రాట్నం తిప్పుతున్న రవణమ్మా..చూరుకింద పడుకున్న సుశీల...గడపలో మంచం వేసుకున్న గంగమ్మ..అప్పుడే వచ్చిన జగన్నాథమ్మా...దేవకీ జగదాంబ ఒకరేమిటి? ఫ్రీగా సినిమా చూస్తున్నట్టు నిలబడి చూస్తున్నారు.

పాపం, వాళ్ళవి రిహార్సులే అనుకుంటున్నారు గానీ..నెలరోజుల ప్రాక్టీసు..వాళ్ళ కమ్మని కాపురంలో పెట్టిన చిచ్చనుకోలేదు.

విషయమంతా విన్న కనకారావు లోకేశ్వరినీ, లోకనాథంనీ చీవాట్లు పెట్టి..అందర్నీ ఇళ్ళకి పోయి పనులు చూసుకొమ్మని..నవ్వాపుకుంటూ ఇంటికొచ్చేసరికి పదిన్నరయింది. నిజానికి తొమ్మిదిన్నరకే రావల్సింది. దారిలో కృష్ణమూర్తి కానిస్టేబులు కలిస్తే..కథంతా చెప్పి, నవ్వి, నవ్వి ఫ్రీగా, టీ త్రాగి మిరపకాయ బజ్జీలు తిని, ఇంటికొచ్చేసరికి ఆ టైమయింది.

ఇంటికొచ్చేసరికి కనకం..

''ఏయ్యా! టయం ఎన్ని గంటలయింది?''

''అదికాదే..ఇయ్యాలేటయిందంటే?..'' అనబోయేసరికి.. .ఉరుములూ...మెరుపులూ లేని..వడగళ్ళ వానలా..

''సెప్పకు..హరికతలు సెప్పకు..ఇన్నాళ్ళు..నువ్వేం సెప్పినా నమ్మాను. నైట్ డూటీలన్నావు. డే డూటీలన్నావు..ఆ పనన్నావు..ఈ పనన్నావు. రాములోర్ని సీతమ్మనాగా..సెంద్రమతి అరిచ్చంద్రుణ్ణినాగా..నిన్ను నమ్మినాను. నాన్నికేం అన్నేయం సేసినాను. అద్దరాత్రి పన్నెండయినా కోడి కురమా సెయ్యమంట సెయినేదా! బొమ్మిడాల పులుసు ఎట్టమంటే ఎట్టనేదా? ఎందుకయ్యా...ఇన్ని కల్లబొల్లి కవుర్లు సెప్పినావు?'' అంటూ కనకారావు మాట వినకుండా సైరన్‌లాగా శ్రుతి పెంచిన కనకం తీరు అర్థంగాక..

''కనకమా..ఒలే నన్ను నమ్మే..నేన్నికెపుడూ..ఏ అన్నాయం సెయ్యనే..''

''ఆ..తెల్సు..మొగ్గుళ్ళ మాటలు నమ్మొద్దని.. ఆ టీవీలో ఆయమ్మా సెప్పింది..మొగుళ్ళని దారిలో పెట్టండి సీరియల్ కతలో- ఇక నేన్నమ్మనంటే నమ్మను. నమ్మనుగాక నమ్మను!'' అని రెచ్చిపోతుంటే..

కనకారావు బ్రహ్మానందం టైపులో తలపట్టుకుని...

''వారి దేవుడోయ్! టీవీలేటి ఇలాటి పాటాలు సెపుతున్నాయి? అసలే మా బతుకులెప్పుడేమవుతాయో తెలీటం లేదు? ఇలగైతే మా కొంపలు కొల్లేరు గావా?'' అనుకున్నాడు అయోమయంగా.

✪

**పి.వి.బి.శ్రీరామమూర్తి**